క్లుప్తంగా

పారిశుధ్య పనుల పరిశీలన



పైమాఘంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ లక్ష్మి

తవణంపల్లె: మండలంలోని అరగొండ మేజర్ పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి పరిశీలించారు. మేజర్ పంచాయతీలో డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని సచివాలయ సిబ్బంది ఆదేశించారు. అదే విధంగా అరగొండ ప్రధాన రహదారిలో హైస్కూల్ వరకు రోడ్డుకు ఇరువైపులా గడ్డిని తొలగించి శుభ్రం చేయించాలని సూచించారు. పంచాయతీలో పారిశుధ్యం పనులు మెరుగు పరచుటకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆమెతో పాటు పంచాయతీ కార్యదర్శి మహేష్, సచివాలయ సిబ్బంది, ప్రశాంత్‌కిషోర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



గోవిందరెడ్డిపల్లెలో వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు, గర్భవతులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఐరన్ మాత్రలు మింగాలన్నారు. రక్తహీనత రాకుండా జాగ్రత్తగా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేసే విధంగా అధికారులు కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్ తెలిపారు. చిత్తూరులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహిళా కార్మికులకు చట్టం ప్రకారం ప్రత్యేక రాయితీలు కల్పించాలని చెప్పారు. కొన్ని సంస్థల్లో 12 గంటలు పని చేయించుకుంటూ శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని జిల్లా కలెక్టర్, కార్మిక అధికారులు ఆదేశించిన కొన్ని రంగాల్లో ఇప్పటికీ అమలు కావడం లేదని ఆరోపించారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రమాదేవి, ఆర్ముగం, విజయకుమార్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ కృష్ణారెడ్డికి ఘన వీడ్కోలు



కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పూతలపట్టు: మండల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వర్తించిన కృష్ణారెడ్డిని మండలంలోని ఉపాధ్యాయులు సన్మానించి, వీడ్కోలు పలికారు. ఆయన విధులు శుక్రవారంతో ముగియడంతో మండలంలోని ఎంఈఓ 2 మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వీడ్కోలు తెలిపారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కృష్ణారెడ్డి సేవలు మరవలేనివని, ఆయన విధి నిర్వహణలో ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలిపారన్నారు. ఎంఈఓగా బాధ్యతారహితంగా, పాఠశాలలను అభివృద్ధి పరంగా ముందంజలో నిలవడానికి చాలా ప్రయత్నించారన్నారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, దేవుని చిత్రపటాలను అందజేశారు.

పరుగెడుతున్న విద్యుత్ మీటర్లు

- పెరుగుతున్న వినియోగం
- రోజు 2 ఎంయూలకు పైగా వాడకం
- మొత్తం సర్వీసులు రూ.2.32 లక్షలు

డివిజన్‌లోని సర్వీసుల వివరాలు		
గృహాలు	-	1,31,740
వాణిజ్యం	-	18,151
పరిశ్రమలు	-	1,607
వ్యవసాయం	-	30,821
ఇతర సర్వీసులు	-	35,889
హెచ్‌టీ సర్వీసు	-	624



చిత్తూరు కార్పొరేషన్: గతేడాది కంటే ఈ సారి ఎండలు మండుతున్నాయి. వేడికి తట్టుకోలేక నీడ కోసం వెతికే పరిస్థితి ఏర్పడింది. రోహిణికార్తె ప్రభావంతో ఉదయం నుంచి ఎండలు సెగలు రేపుతున్నాయి. డివిజన్ పరిధిలో పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత కనిపిస్తోంది. చిత్తూరులో గరిష్ఠంగా 37–44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఎండల తీవ్రతతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఎయిర్ కండీషన్లు, కూలర్లు, ఫ్యాన్ల వాడకం పెరగడంతో పాటు మధ్యాహ్న సమయంలో జనం ఇళ్లకే పరిమితమవడంతో విద్యుత్ వాడకం పెరిగినట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో మేలో వాడకం గతేడాది కంటే పెరిగింది. రోజు 2 ఎంయూల (మిలియన్ యూనిట్లు)కు పైగా వాడుతున్నారు. గత సంవత్సరం కంటే ప్రస్తుతం రోజువారీ వాడకం భారీగా పెరిగింది. వాటి మధ్య వ్యత్యాసాలు కింది విధంగా ఉన్నాయి.

ట్రిప్పింగ్ సమస్యలు

విద్యుత్ వాడకం ఎక్కువ కావడంతో డివిజన్‌లో తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. ఈ నెలలో ఇప్పటి వరకు 50 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురయ్యాయి. దీంతో పాటు 33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి లైన్ సరఫరా అవుతుండగా 100 సార్లు పైగా లైన్ ట్రిప్ అయ్యాయి. అధిక వినియోగం వల్ల ఈనెలలో ఇప్పటి వరకు 33 కేవీ లైన్‌లాస్‌ల వలన 12 గంటలు, ట్రిప్పింగ్ వలన మరో 10 గంటలు, 11 కేవీ ట్రిప్పింగ్‌తో 15, లైన్‌లాస్ వలన 15 గంటలు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

వాడకం పెరిగింది

డివిజన్‌లో వాడకం పెరిగింది. గత సంవత్సరం కంటే ఎండలు పెరిగాయి. దీంతో పాటు నిరంతరం విద్యుత్ వస్తువుల వినియోగం పెరిగింది. రోజుకు సాధారణంగా దాదాపు 20 లక్షల యూనిట్లు వాడుతున్నారు. సాధ్యమైనంత వరకు అంతరాయం లేకుండా సరఫరా ఇస్తున్నాం.

– పద్మనాభపిళ్లై, ఈఈ, ట్రాన్స్‌కో



విద్యుత్ వాడకం (మిలియన్ యూనిట్లలో)		
తేదీ	గత ఏడాది	ఈ ఏడాది
మే 15	2.04	2.16
మే 16	2.57	2.32
మే 17	2.09	2.24
మే 18	2.15	2.20
మే 19	2.03	2.21
మే 20	2.17	2.26
మే 21	1.91	2.24
మే 22	1.94	2.28
మే 23	1.95	2.18
మే 24	2.09	2.24
మే 25	1.95	2.22
మే 26	2.18	2.25
మే 27	2.04	2.26
మే 28	1.90	2.27
మే 29	1.80	2.26
మే 30	2.02	2.30
మే 31	2.02	2.28

నేడు హనుమాన్ జయంతి వేడుకలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం పొన్నియమ్మ గుడివీధిలో వెలసిన శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకులు సుధాకర్ గురుక్కల్ తెలిపారు. వేకువజామున 2.30 గంటలకు సుప్రభాతసేవ, 3 గంటలకు మహాభిషేకం, అలంకారం, ధూపదీప నైవేద్యం పూజలు, సహస్రనామార్చన, వడమాల సేవ, తోమాలసేవ, సింధూర పూజ, తులసి అష్టోత్తర, మహా మంగళ హారతి అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులకు సర్వ దర్శనం, 7 గంటలకు రామకోటి భజన ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు విరాళం



ట్రస్టుకు విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రసుకు ఓ దాత శుక్రవారం విరాళం అందించారు. తమిళనాడులోని చెన్నైకు చెందిన దాత శ్రీనివాసన్ ట్రస్టుకు రూ.1,00,116 అందజేశారు. వారికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితుల ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు కోదండపాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి





హాజరైన మధ్యాహ్నభోజన నిర్వాహకులు, శిక్షణ కార్యక్రమంలో సూచనలు చేస్తున్న ఎంఈఓ నాగేశ్వర్‌రావు

బంగారుపాళెం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిర్వాహకులు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓలు నాగేశ్వర్ రావు, రమేష్‌బాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మండలంలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలల్లో రోజువారీ మెనూ ప్రకారం వంట ఎలా చేయాలి, రుచికరంగా పోషకాలు అందేలా ఎలా వండాలి, వంటశాల ఆవరణలో తీసుకోవాల్సిన శుభ్రత, తదితర అంశాలను వీడియోల ద్వారా తెలియజేశారు. వారు మాట్లాడుతూ, విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందిచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందివ్వాలని ఆయన సూచించారు. పిల్లలకు పెట్టే భోజనం రుచిగా ఉండాలన్నారు. శుచి శుభ్రత పాటించాలని ఆదేశించారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని, ఆ రోజు నుంచే పాఠశాలల్లో మెనూ పాటించాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్ శ్రీదేవి, హెచ్‌ఎంలు రాజేంద్ర, ధనంజయరాజు, ఉపాధ్యాయులు జగదీష్, లక్ష్మీపతి, ఉమా, శివరంజిని, మోహన్‌రెడ్డి, కమలాపతి, సభానాభాను, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

197రామాపురంలో వైద్యసేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: మండలంలోని 197 రామాపురంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ అనూష 63 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సరస్వతి, దివ్య, శశి, అనురాధ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీదేవి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె: మండలంలోని ముట్టుకూరులోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో మహా భారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ద్రౌపదీదేవి కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులకు, ద్రౌపదీదేవికి అభిషేకం పూజలు చేయించారు. అనంతరం ద్రౌపదీదేవిని ప్రత్యేక అలంకరణ చేయించారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛరణ పఠనం చేస్తూ ద్రౌపదీదేవి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిపించారు. అనంతరం ద్రౌపదీదేవి, పాండవుల విగ్రహాలను ఊరేగించారు.

చిన్న పొరబాటు జరగడానికి వీల్లేదు



సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: ఓట్ల లెక్కింపు రోజున ఏ చిన్న పొరబాటు జరగడానికి వీల్లేదని చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు అన్నారు. కలెక్టరేట్‌లో ఓట్ల లెక్కింపునకు కేటాయించిన అధికారులు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్స్ నుంచి కంట్రోల్ యూనిట్స్, బ్యాలెట్ యూనిట్స్‌ను కేంద్రానికి జాగ్రత్తగా పంపించాలన్నారు. ఈవీఎం యంత్రాలను తీసుకెళ్లేటప్పుడు పక్కాగా పర్యవేక్షించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 4న ఎస్వీ సెట్ కౌంటింగ్ కేంద్రంలో చిత్తూరు అసెంబ్లీ ఈవీఎంలు లెక్కించే సమయంలో పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. చిత్తూరు అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్‌కు 3 టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. టేబుల్స్ వద్ద అన్ని రకాల ఫార్మెట్‌లు, స్టేషనరీ, పీఎస్‌ల వారీగా పోల్ డేటా, 17 సీ ఫారంలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. విధులపై ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. తప్పులు చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, చిత్తూరు రూరల్ తహసీల్దార్ హసీనాబీ తదితర అధికారులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 41 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విజయం డిగ్రీ కళాశాల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: ప్రాంగణ ఎంపికల్లో 41 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని విజయం కళాశాల చైర్మన్ తేజోమూర్తి అన్నారు. ఆ కళాశాలలో శుక్రవారం రెనిక్స్ టెక్నాలజీస్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ చాటిన 41 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరికి వార్షిక వేతనం రూ.5,20,000 ఉంటుందని చెప్పారు. గత విద్యాసంవత్సరం తమ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 424 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

మురళి సేవలు అభినందనీయం



మురళిని సన్మానిస్తున్న అధ్యాపకులు



ఎంఆర్‌సీలో పరమానందయ్యను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్(లైబ్రరీ సైన్స్)గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌కే మురళీ సేవలు అభినందనీయమని ప్రిన్సిపల్ వందనా త్రిపాఠి అన్నారు. మురళీ శుక్రవారం ఉద్యోగవిరమణ పొందారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి మురళి చేసిన సేవలు ప్రశంసనీయమైనవని కొనియాడారు. ఉద్యోగులకు విరమణ తప్పనిసరని గుర్తు చేశారు. అనంతరం మురళి దంపతులను అధ్యాపకులు పూలమాలలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. బంగారుపాళెం దళితవాడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న పరమానందయ్య శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక ఎంఆర్‌సీలో మండల విద్యాశాఖ తరపున ఘనంగా సన్మానించారు. ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు మాట్లాడుతూ, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి పరమానందయ్య చేసిన కృషిని అభినందించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు పూలదండలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు.